సాక్షి
పార్వతీపురం మన్యం

ఆదివారం । 15 । సెప్టెంబర్ । 2024



పసుపు సాగుపై పెరుగుతున్న ఆసక్తి
సీతంపేట ఏజెన్సీలో పసుపు సాగు విస్తీర్ణం ఏటా పెరుగుతోంది. కొండపోడులో గిరిజన రైతులు సాగుకు ఆసక్తి చూపుతున్నారు. - 8లో



సంప్రదాయబద్ధంగా సిరిమాను సంబరం - 8లో
పైడిమాంబ సిరిమాను సంబరం సంప్రదాయబద్ధంగా నిర్వహించాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు.



అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆకలి కేకలు
అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు సకాలంలో వంట చేయక పోవడం వల్ల పిల్లలు ఆకలితో ఇబ్బంది పడుతున్నారు. - 8లో

న్యూస్‌రీల్

కుదిరిన ఒప్పందం



ఒప్పంద పత్రాలను చూపిస్తున్న ఇన్‌చార్జి వీసీ రాజ్యలక్ష్మి, తదితరులు

విజయనగరం టౌన్: జేఎన్‌టీయూ, అక్షయాస్ గ్రీన్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, గ్లోబల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్‌ల మధ్య అవగాహన ఒప్పందం కుదిరిందని వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి శనివారం తెలిపారు. ఆరు అంశాలపై ఒప్పందం కుదిరిందన్నారు. వాటిలో కెపాసిటీ బిల్డింగ్ ప్రొగ్రామ్స్ ఫర్ ది ఎంప్లాయిస్, స్టూడెంట్స్, ట్రాన్స్‌ఫర్ ఆఫ్ టెక్నాలజీ ఫ్రమ్ అకాడమీ టు ఇండస్ట్రీ తదితరవి ముఖ్యమైనవిగా పేర్కొన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ జి.జయసుమ, డాక్టర్ జీజే నాగరాజు, డీఎంసీ కోఆర్డినేటర్ అనిల్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని పరామర్శించిన జెడ్పీ చైర్మన్



హర్షవర్ధన్‌ను పరామర్శిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

విజయనగరం ఫోర్ట్: బొబ్బిలికి చెందిన గురుకుల పాఠశాల విద్యార్థి హర్షవర్ధన్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడి విజయనగరంలోని తిరుమల మెడికవర్ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నాడు. విద్యార్థిని జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు శనివారం పరామర్శించారు. విద్యార్థి కోలుకునేవరకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. అధైర్య పడవద్దని, అండగా ఉంటామని విద్యార్థి తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు. ఆయన వెంట వంగర ఎంపీపీ సురేష్ ముఖర్జీ, బొబ్బిలి జెడ్పీటీసీ సభ్యురాలు శాంతకుమారి ఉన్నారు.

కన్నులపండువగా కోడూరుమాత యాత్ర



కోడూరుమాత పుణ్యక్షేత్రంలో నాల్గవ బలిపూజలో పాల్గొన్న విశాఖ అగ్రపీఠ గురువులు గురుశ్రీ ఆంథోని, థామస్, రవితేజ

కోడూరు(బాడంగి): మండలంలోని కోడూరు గ్రామంలో కోడూరుమాత యాత్ర శనివారం కన్నులపండువగా సాగింది. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు విజయవాడ, గుంటూరు తదితర దూరప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో యాత్రకు తరలివచ్చారు. కోడూరు పుణ్యక్షేత్ర విచారణకర్త, ఫాదర్ యుగల్ కుమార్ ఆధ్వర్యంలో సాగిన దివ్యబలిపూజల్లో పాల్గొన్నారు. ఫాదర్లు చెప్పిన శాంతి సందేశాలను ఆలకించారు. తలనీలాలు సమర్పించారు. టెంకాయలు కొట్టి పూజలు చేశారు. మొక్కుబడులు చెల్లించారు. విశాఖ అగ్రపీఠం నుంచి గురుశ్రీ ఆంథోని, థామస్, రవితేజ తదితరులు భక్తులకు మాత ఆశీర్వాదాన్ని అందజేశారు. స్థానిక అధికారులు భక్తులకు తాగునీరు, వైద్య సదుపాయాలు కల్పించారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా, యాత్రలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బొబ్బిలి డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ నారాయణరావు ఆధ్వర్యంలో ఐదురుగు ఎస్‌ఐలు, 100 మంది పోలీస్ సిబ్బంది బందోబస్తు విధులు నిర్వహించారు.



కోడూరుమాతను దర్శించుకుంటున్న భక్తులు

ప్రభుత్వ నిర్ణయం సరైనది కాదు



మెడిసిన్, ఇంజినీరింగ్ వంటి చదువులు మధ్యతరగతి కుటుంబాల కల. వాటిని తమ పిల్లలకు అందించే క్రమంలో తల్లితండ్రులు నిరంతర కష్టపడతారు. వారికి ప్రభుత్వం అండగా ఉండాలే తప్ప అపకారం చేయరాదు. మెడికల్ కళాశాలలు వద్దనడం, ప్రభుత్వ కళాశాలలను ప్రైవేటురంగాలకు అప్పగించేందుకు ప్రయత్నించడం వంటివి సరైన నిర్ణయాలు కావు. విద్యార్థులకు నష్టం కలుగుతుంది. విద్యార్థులకు వైద్య విద్య దూరమవుతుంది.
– చందక జగదీష్ కుమార్, న్యాయవాదుల బార్ అసోసియేషన్ సభ్యుడు, పాలకొండ

రూ.లక్షలు ఖర్చు చేయగలరా?

ప్రభుత్వ వైద్యకళాశాలలు ఏర్పాటైతే మాలాంటి పేద కుటుంబాల విద్యార్థులకు ధైర్యం వస్తుంది. సీట్లు సాధించగలమన్న నమ్మకం కలుగుతుంది. ప్రభుత్వం ఆ దిశగా నిర్ణయాలు తీసుకోవాలి. మెడికల్ సీట్లు తగ్గినా, కళాశాలలను ప్రైవేటు సంస్థలకు అప్పగించినా విద్యార్థుల భవిష్యత్తును మొగ్గదశలో తుంచడమే అవుతుంది. మెడిసిన్ చదువుకోసం మా లాంటి పేదకుటుంబాల తల్లిదండ్రులు రూ.లక్షలు ఖర్చుచేయగలరా?. వైద్యవిద్యను పేద కుటుంబాల విద్యార్థులకు చేరువచేసే నిర్ణయాలు అవసరం.
– ఎస్.రాణి, బైపీసీ విద్యార్థిని, సీతంపేట మండలం



- నాడు ఆన్‌లైన్... నేడు ఆఫ్‌లైన్ విధానంలో విక్రయాలు
- ప్రజలకు రెట్టింపు భారం, భవన నిర్మాణాలు ఆలస్యం
- నదుల వెంబడి దోచుకున్నవాళ్లకు దోచుకున్నంత ఇసుక
- స్టాక్ యార్డుల్లో మాత్రం తరిగిపోయిన నిల్వలు
- ఇసుక దొరక్క భవన నిర్మాణదారులు గగ్గోలు



బొబ్బిలి స్టాక్ పాయింట్‌లో తరిగి పోయిన ఇసుక నిల్వ

ఉచితమన్నారు.. ఉసూరుమనిపిస్తున్నారు!

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

ఇసుక ఉచితమన్నారు... తీరా అధికారంలోకి వచ్చాక టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రజల నెత్తిన సమ్మెట మోపుతోంది. రీచ్‌లు ఏర్పాటు చేయలేదు. మరోవైపు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నిల్వ చేసిన దాదాపు లక్ష మెట్రిక్ టన్నుల ఇసుక ఇప్పుడు కరిగిపోయింది. ఈ కృత్రిమ కొరత కాస్తా అక్రమార్కులకు కాసుల వర్షం కురిపిస్తోంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయ్యేనాటికి స్టాక్ పాయింట్లలో 94,027 మెట్రిక్ టన్నుల మేర ఇసుక నిల్వ ఉండేది. ప్రస్తుతం బొబ్బిలి స్టాక్ పాయింట్‌లో మాత్రమే 36,983 మెట్రిక్ టన్నులు ఇసుక ఉంది. కొత్తవలస, డెంకాడ స్టాక్ పాయింట్లలో ఇసుక లేదు. ఆ ఇసుకకు కూడా మెట్రిక్ టన్నుకు రూ.605 చొప్పున వసూలుచేస్తున్నారు. ఇక అక్రమార్కుల దగ్గర కొనాలంటే అందుకు రెండు మూడు రెట్లు చొప్పున భవన నిర్మాణదారులు చెల్లించాల్సిందే.

● బొబ్బిలిలో అడుగంటుతున్న ఇసుక నిల్వ

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లో ఇసుక స్టాక్ పాయింట్ ఏర్పాటు చేశారు. దాదాపు లక్షకు పైగా టన్నుల ఇసుకను ఇక్కడ నిల్వ చేశారు. సీసీ కెమెరాల పర్యవేక్షణ, ఆన్‌లైన్ బిల్లింగ్ విధానంతో ఇసుక విక్రయాలు జరిగేవి. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రాగానే వాటిన్నింటికీ నీళ్లొదిలేశారు. ఆన్‌లైన్ బిల్లులకు స్వస్తి పలికేసి చేతి రాతతోనే రశీదులు ఇస్తున్నారు. వాటికి లెక్కాపత్రం లేదు. ఇలా దాదాపు 50 వేల టన్నుల ఇసుకను విక్రయించేశారు. తూనిక యంత్రం లేదు. ఏదో గుడ్డి అంచనాతో ఇసుక లోడ్ చేస్తున్నారు. ఒక బిల్లు చూపించి రెండు మూడేసి ట్రిప్పులు తరలించుకుపోతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

ఉచితం అంటూనే వసూళ్లు!

బొబ్బిలి గ్రోత్ సెంటర్ వద్దనున్న స్టాక్ పాయింట్‌లో జూలై 9న ఇసుక విక్రయాలు ప్రారంభమ య్యాయి. కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక అని చెబుతూనే మెట్రిక్ టన్ను ఇసుకకు రవాణా చార్జీల పేరుతో రూ.605 చొప్పున వసూలు చేస్తోంది. మరోవైపు అదే సమయంలో విక్రయాలు ప్రారంభమైన డెంకాడ, కొత్తవలస స్టాక్ పాయింట్లలో నిల్వ లు తరిగిపోయాయి. దీంతో బొబ్బిలి స్టాక్ పాయింట్‌లో ఇసుకను కేవలం నెలరోజుల వ్యవధిలోనే 50 వేల టన్నుల ఇసుక ఊడ్చేశారు. ఇలా లబ్ధిపొందినవారిలో టీడీపీకి చెందిన నాయకులు, కూటమి పార్టీల కార్యకర్తలు ఉన్నారనేది బహిరంగ రహస్యమే.

చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లుగా...

ఇసుక దాదాపుగా సగం స్టాక్ తరలిపోయిన తర్వాత చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు అధికారులు చెకింగ్ పాయింట్ విధానం తీసుకొచ్చారు. ఇసుక కావాల్సిన వారు తహసీల్దార్ కార్యాలయంలో కూపన్ తీసుకుని స్టాక్ పాయింట్ వద్దకు రావాలని చెబుతున్నారు. దీంతో కొంతవరకూ అక్రమాలకు అడ్డుకట్ట పడింది. కానీ ఇసుక మరింత భారమైంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో బొబ్బిలిలో ఎవరైనా ఒక ట్రాక్టర్ ఇసుక కావాలంటే రూ.1500 అయ్యేది. ఇప్పుడు రూ.2,500 నుంచి రూ.3 వేల వరకూ చేతిచమురు వదులుతోంది.

గ్రామాల్లో వేలం పాటలు

నదీ తీరంలోని, తీరానికి సమీపంలోని గ్రామాల్లో ఇసుక అక్రమ వ్యాపారానికి వేలంపాటలు మొదలయ్యాయి. ఇందులో గత జన్మభూమి కమిటీల్లోని సభ్యులు ఇప్పుడు కొత్త అవతారం ఎత్తారు. వారి కనుసన్నల్లోనే ఇసుక అక్రమ వ్యాపారం మూడు పూలు ఆరు కాయలుగా సాగిపోతోంది. ఉదాహరణకు బొబ్బిలి మండలం ఆలజంగి గ్రామంలో వేగావతి నది నుంచి ఇసుక తవ్వుకునేందుకు రూ. 1.40 లక్షలకు వేలం వేశారు. అలాగే భీమవరం, పినపెంకి, గొల్లాది తదితర గ్రామాల్లో గ్రామాభివృద్ధి నిధి సాకుతో నాటు బండికి రూ.50 చొప్పున వసూలు చేస్తున్నారు.

● ఎలాగైనా కష్టమే...

టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక ఉచిత ఇసుక మాటేమో కానీ అసలు ఇసుక దొరకడమే దుర్లభమైపోతోంది. చివరకు నాటుబళ్లపై తెచ్చే ఇసుక కూడా దొరకట్లేదు. సొంతిల్లు నిర్మించుకోవాలనుకున్న వాళ్ల ఆశలపై నీళ్లు చల్లించినట్లు అయ్యింది. తప్పనిసరి పరిస్థితుల్లో ఎక్కడి నుంచైనా ఎక్కువ మొత్తం చెల్లించి తెచ్చుకుంటే ఆ ట్రాక్టర్లను పోలీసులు పట్టుకుని సీజ్ చేసేస్తున్నారు. కేసులు కూడా నమోదు చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చీపురుపల్లి నియోజకవర్గ కేంద్రంలో నాగంపేట వద్ద ఇసుక స్టాక్ పాయింట్‌ను ఏర్పాటు చేశారు. ఇప్పుడు టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ స్టాక్ పాయింట్ లేదు సరికదా ఎక్కడా ఇసుక దొరికే పరిస్థితి లేదు.

'ఉచితం'అంటే మూడు రెట్లు పెట్టాలా...



గత ప్రభుత్వ హయాంలో ట్రాక్టర్ ఇసుక రూ.2,500కు లభించేది. ఇప్పుడు మాత్రం అదే ట్రాక్టర్ ఇసుక అవసరానికి దొరక్కపోగా ఎక్కడో బాధలు పడి కొనుగోలు చేద్దామంటే రూ.6 వేలు నుంచి రూ.7 వేలు అవుతోంది. టీడీపీ నాయకులు ఇసుక ఉచితం అంటే చేతి సొమ్ము మూడు రెట్లు పెట్టాలా? ఇసుక ఖర్చు తీవ్ర భారమైపోయింది. ఇంటి నిర్మాణం ఆలస్యమవుతోంది.
– నేరుడుబిల్లి శంకరరావు, బుధరాయవలస గ్రామం, మెరకముడిదాం మండలం

గోస్తనీ ఇసుక... బండెనక బండి కట్టి...

గోస్తనీ పరివాహక గ్రామాల నుంచి ఇసుక అక్రమంగా బయటికి వస్తూనే ఉంది. కానీ గోస్తనీ నదిలో ఇసుక నిల్వలు లేవని, ఎక్కడా తవ్వకాలు చేయకూడదని గతంలోనే భూగర్భ గనులశాఖ అధికారులు ప్రకటించారు. ప్రస్తుతం టైరు బండ్లతో ఇసుక వ్యాపారం అక్రమంగా సాగుతోంది. ఒక బండి ఇసుక రూ.వెయ్యి నుంచి రూ.1200కు అమ్ముతున్నారు. కొందరు తెలివిగా నది పక్కనే బండి ఇసుక రూ.500కు కొని తమ కళ్లాల వద్ద నిల్వచేసి తర్వాత ట్రాక్టరుతో అమ్ముకుంటున్నారు. ట్రాక్టరు ఇసుక (నాలుగు బళ్లు) రూ.4,500 వరకూ పలుకుతోంది. ఒక్కోసారి డిమాండ్‌ను బట్టి ఆ ధర కూడా పెంచేస్తున్నారు.

ఇసుక తవ్వకాలకు ఏర్పాట్లుచేస్తున్నాం...

వంగర మండలంలోని కొండచాకరాపల్లి వద్ద సువర్ణముఖి నదిలో ఇసుక పూడిక తొలగించడానికి ఏర్పాట్లు చేశాం. అక్కడ సుమారు 70 వేల మెట్రిక్ టన్నుల ఇసుక తవ్వకానికి ఏర్పాట్లు చేస్తున్నాం. తెర్లాం మండలంలోని కుసుమూరు, సంతకవిటి మండలంలోని తామర ప్రాంతాల్లో ఇసుక రీచ్‌లను గుర్తించాం. జిల్లాలో సరాసరి రోజుకు 950 మెట్రిక్ టన్నులు బుకింగ్ జరుగుతోంది.
– సీహెచ్ సూర్యచంద్రరావు, డిప్యూటీ డైరెక్టర్, గనుల శాఖ

● అక్కడంతా బ్లాక్‌లోనే..

గతంలో సంతకవిటి మండలం తమరాం వద్ద ఇసుక రీచ్ ఉండేది. ఇక్కడ ట్రాక్టర్ లోడ్ రూ.1800కు వచ్చేది. సంతకవిటితో పాటు చుట్టుపక్కల ప్రాంతాలకైతే రూ.2500 నుంచి రూ.3 వేలకు ఇసుక లోడ్ వేసేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇంకా ఎలాంటి రీచ్‌లు ఏర్పాటుచేయలేదు. ఇసుక కావాలంటే బ్లాక్‌లోనే భవననిర్మాణదారులు కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి. దీంతో సంతకవిటి మండలంలో ట్రాక్టర్ ఇసుక రూ.3500లకు పైమాటే. రాజాం, పరిసర ప్రాంతాలకు ట్రాక్టర్ ఇసుక రావాలంటే రూ.5 వేలు పెట్టాల్సి వస్తోంది.

ఇసుక ఒక సమస్య అయిపోయింది...



మా ఇంటి నిర్మాణ సమయంలో దగ్గర్లోనే ఇసుక రీచ్ ఉండేది. ట్రాక్టర్‌తో ఇసుక తెప్పించుకునేవాళ్లం. లోడ్‌కు రూ.2500 చొప్పున పెడితే ఇసుక ఇంటికి చేరేది. ఇప్పుడు రీచ్‌లు లేవు. బ్లాక్‌లో ఇసుక తెస్తున్నారు. ట్రాక్టర్ ఇసుకకు రూ.3500 అవుతోంది. టైరు బండ్లతో తెప్పించాలంటే రూ.3200 పెడుతున్నాం. ఇసుక సకాలంలో దొరక్క నిర్మాణ పనులు పూర్తి కావట్లేదు.
– గార శ్రీకాంత్, మందరాడ, సంతకవిటి మండలం

● కొత్తవలసలో మూణ్నాళ్ల ముచ్చట



ఇసుక లేని కొత్తవలస స్టాక్ యార్డు

ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిననాటికి కొత్తవలస స్టాక్‌యార్డులో అధికారిక గణాంకాల ప్రకారం 11,805 మెట్రిక్ టన్నులు ఉండేది. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ ఇసుక అమ్మకాలు ప్రారంభించారు. కేవలం 20 రోజుల్లోనే పూర్తిగా ఖాళీ చేసేశారు. కానీ అమ్మింది 6,976 మెట్రిక్ టన్నులే అని చూపిస్తున్నారు. మరి మరి మిగిలిన 4,829 టన్నులు ఇసుక ఏమైందో ఎవరికీ తెలవదు. ఇంటిదొంగలను ఈశ్వరుడు కూడా పట్టలేడన్నట్లుగా ఆ ఇసుక దొంగలెవరో బహిరంగ రహస్యమే.

కురుపాం ఏపీఎం సరెండర్

- అసభ్యకరంగా వేధిస్తున్నారని వీవోఏల ఫిర్యాదు
- విచారణ అనంతరం చర్యలు తీసుకున్న కలెక్టర్

సాక్షి, పార్వతీపురం మన్యం: కురుపాం ఏపీఎం ఈవీ కిశోర్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకుంటూ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. సెర్ప్ సీఈవోకు రిపోర్టు చేయాల్సిందిగా పేర్కొన్నారు. తమ పట్ల ఏపీఎం కిశోర్ అసభ్య పదజాలం వాడుతూ, మానసిక క్షోభకు గురి చేస్తున్నారని కురుపాం క్లస్టర్ పరిధిలోని మహిళా సమాఖ్య వీవోఏలు గత ఆగస్టు నెలలో సెర్ప్ సీఈవోకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. కొద్దిరోజుల కిందట డీఆర్‌డీఏ పథక అధికారికి కూడా వినతిపత్రం అందజేశారు. దీనిపై విచారణ చేపట్టాలని డీఆర్‌డీఏ పీడీని కలెక్టర్ ఆదేశించారు. విచారణ అనంతరం నివేదికను పరిశీలించిన కలెక్టర్.. ఏపీఎం కిశోర్‌ను సరెండర్ చేస్తూ ఈ నెల 11న ఉత్తర్వులు జారీ చేశారు. ఉన్నతి ఏపీఎం ఆర్.రామకృష్ణకు కురుపాం ఏపీఎం అదనపు బాధ్యతలను అప్పగించారు.

గతంలోనూ అనేక అవినీతి ఆరోపణలు

ఏపీఎం ఈవీ కిశోర్‌పై గతంలోనూ పలు ఫిర్యాదులు వచ్చాయి. మహిళా సిబ్బందిపై దురుసుగా ప్రవర్తిస్తుంటారని.. అసభ్యకరమైన సందేశాలు పెడుతూ వేధిస్తుంటారని విచారణలో పలువురు వీవోఏలు వాపోయినట్టు తెలిసింది. కొమరాడలో పని చేసినప్పుడూ వివిధ అవినీతి ఆరోపణలను ఎదుర్కొన్నారు. పార్వతీపురం టీపీఎంయూ పరిధిలో పనిచేస్తున్న డీపీఎం, ఏపీఎంలు, సీసీల ఈపీఎఫ్ సొమ్ము చెల్లించకుండా స్వాహా చేసినట్టు ఆరోపణలు వినిపించాయి. స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ, ఉన్నతి, ఎఫ్‌పీవో రుణాల్లో అవకతవకలకు పాల్పడినట్లు.. వీడీవీకే మిషన్స్, పసుపు, చింతపండు ప్రాసెసింగ్ కొనుగోల్లోనూ గోల్‌మాల్ చేసినట్లు తెలిసింది. స్త్రీ నిధి రుణాల కింద సభ్యుల ఉమ్మడి ఖాతాలో నిధులు వేయకుండా.. దారి మళ్లించినట్లు సమాచారం. కురుపాంలో ఒక సంఘానికి ఇవ్వాల్సిన రూ.3 లక్షలను కంప్యూటర్ ఆపరేటర్ బంధువు వ్యక్తిగత బ్యాంకు ఖాతాలోకి మళ్లించినట్లు తెలిసింది.

లోక్‌అదాలత్‌లో 5,491 కేసుల పరిష్కారం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి కళ్యాణ్ చక్రవర్తి



విజయనగరం లీగల్: కేసులను సామరస్య పూర్వకంగా, స్నేహపూరిత వాతావరణంలో ఎటువంటి వివాదాలు లేకుండా పరిష్కరించే ఏకైక మార్గం లోక్‌అదాలత్ అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ బి.సాయికళ్యాణ్ చక్రవర్తి అన్నారు. లోక్ అదాలత్‌లతో కక్షిదారులకు సమయం, డబ్బు ఆదా అవుతుందని, మనశ్శాంతి కలుగుతుందన్నారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలోని విజయనగరం, పార్వతీపురం, బొబ్బిలి, సాలూరు, శృంగవరపుకోట, చీపురుపల్లి, గజపతినగరం, కొత్తవలస, కురుపాం కోర్టులలో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లలో 5,491 కేసులు పరిష్కరించినట్టు తెలిపారు. వీటివల్ల 10,600 మంది కక్షిదారులకు ప్రయోజనం పొందగా, రూ.32 కోట్ల మేర లబ్ధిపొందారన్నారు. ఈ అదాలత్‌లో రెండవ శ్రేణి జిల్లా న్యాయమూర్తి ఎస్.దామోదర్ రావు, కుటుంబ న్యాయస్థానం జిల్లా న్యాయమూర్తి, మూడవ శ్రేణి న్యాయమూర్తి ఎం.మీనాదేవి, మహిళా కోర్టు న్యాయమూర్తి ఎస్. పద్మావతి, పోక్సో కోర్టు న్యాయమూర్తి కె.నాగమణి, సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.వి జయకళ్యాణి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి బీహెచ్‌వీ లక్ష్మికుమారి, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి టి.వి.రాజేష్ కుమార్, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎల్.దేవిరత్నకుమారి, అడిషినల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ బి.రమ్య, మొబైల్ న్యాయమూర్తి పి.బుజ్జి, ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి ఎం. శ్రీనివాసరావు, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎ.హరీష్, కోర్టు సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.



అదాలత్‌లో పాల్గొన్న కక్షిదారులు

కోర్టుల వారీగా లోక్ అదాలత్‌లో రాజీ అయిన కేసులు ఇలా...	
విజయనగరం	1,806
పార్వతీపురం	410
బొబ్బిలి	762
సాలూరు	587
శృంగవరపుకోట	416
గజపతినగరం	634
చీపురుపల్లి	569
కొత్తవలస	263
కురుపాం	44
మొత్తం	5,491

ఎంఈఓ వ్యవస్థ నిర్వీర్యం!

- స్కూల్ కాంప్లెక్స్‌లను కుదిస్తున్న ప్రభుత్వం
- ఇకపై కాంప్లెక్స్ చైర్మన్‌లే డ్రాయింగ్ ఆఫీసర్లు
- ఇద్దరు ఎంఈఓలలో ఒకరిని తొలగించేందుకు సన్నాహాలు!
- విద్యావ్యవస్థకు నష్టంతప్పదంటున్న విద్యావేత్తలు



ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహిస్తున్న ఎంఈఓ ఆనందరావు

వీరఘట్టం: ప్రభుత్వ బడుల బలోపేతానికి గత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విప్లవాత్మక సంస్కరణలు చేపట్టింది. ప్రమాణాలతో కూడిన విద్యాబోధన సాగేలా చూడడం, విద్యార్థులకు ఉజ్వల భవితను అందించేలా బోధన ప్రణాళిక అమలును నిరంతర పర్యవేక్షణకు మండలానికి ఇద్దరు ఎంఈఓలను నియమించింది. హైస్కూల్స్‌లో పనిచేసే సీనియర్ ప్రధానోపాధ్యాయులకు ఎంఈఓ-1, ఎంఈఓ-2గా గుర్తించి నిబంధనలకు అనుగుణంగా పదోన్నతులు కల్పించింది. ఈ వ్యవస్థతో ప్రభుత్వ విద్య బలోపేతమైంది. పాఠశాలలపై పర్యవేక్షణ పెరగడంతో సత్ఫలితాలు వస్తున్నాయి. పదో తరగతి ఫలితాల్లో పార్వతీపురం మన్యం జిల్లా వరుసగా రెండేళ్లు రాష్ట్రస్థాయిలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లల చదువుకు భరోసా దొరికింది. విద్యావ్యవస్థను బలోపేతం చేస్తూ గత ప్రభుత్వం అమలుచేసిన సంస్కరణలు విద్యావేత్తలు సైతం మెచ్చుకున్నారు. అయితే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం వాటిని నిర్వీర్యం చేసేందుకు అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా తొలుతగా ఎంఈఓ వ్యవస్థను రూపుమాపేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్టు సమాచారం. స్కూల్ కాంప్లెక్స్‌లను కుదించి, కాంపెక్స్ చైర్మన్‌కు డ్రాయింగ్ ఆఫీసర్లుగా చేసి, ఎంఈఓ-2గా ఉన్న వారిని మరలా హైస్కూల్స్‌కు హెచ్ఎంలుగా పంపిస్తారని తెలిసింది.

స్కూల్ కాంప్లెక్స్‌ల కుదింపు

ప్రతినెలా స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను ఎంపిక చేసిన ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తారు. ఆ హైస్కూల్ హెచ్ఎంను కాంప్లెక్స్ చైర్మన్‌గా పిలుస్తారు. ఈ సమావేశంలో పాఠశాలల బలోపేతంపై చర్చిస్తారు. ఇలా ప్రతినెలా కాంప్లెక్స్ సమావేశంలో ఒక అంశంపై ఉపాధ్యాయులు చర్చించి తీర్మానం చేస్తారు. ప్రస్తుతం వీరఘట్టం మండలంలో ఆరు కాంప్లెక్స్‌లు ఉన్నాయి. వీటిని 4గా కుదించారు. ఇలా పార్వతీపురం మన్యం జిల్లాలో ఉన్న 120 కాంప్లెక్స్‌లను సగానికి కుదించేందుకు విద్యాశాఖ చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా శనివారం జిల్లా వ్యాప్తంగా ప్రతీ మండలంలో ఎంఈఓల ఆధ్వర్యంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకుల సూచనలతో కాంప్లెక్స్‌లను కుదించేందుకు ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. ఇన్నాళ్లూ ఎంఈఓ-2లు నిర్వహించే విధులను ఎంఈఓ-1లకు అప్పగించి ఎంఈఓ-2లను బాధ్యతల నుంచి తప్పించి తిరిగి హెచ్ఎంలుగా పంపిస్తారని విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి.

ప్రభుత్వ ఆదేశాల మేరకే...

ప్రభుత్వ ఆదేశాల మేరకు స్కూల్ కాంప్లెక్స్‌లను కుదిస్తున్నాం. దీనివల్ల ప్రతీ కాంప్లెక్స్‌లో ప్రస్తుతం 35 నుంచి 40 మంది ఉపాధ్యాయులు (ఎస్జీటీలు) ఉంటారు. సర్కారు బడుల బలోపేతం కోసమే కాంప్లెక్స్‌లను మెర్జ్ చేస్తున్నాం. ప్రస్తుతం అన్ని మండలాల్లో ఎంఈఓల ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సంఘాల సూచనలతో కాంప్లెక్స్‌ల కుదింపుపై చర్చిస్తున్నాం. రెండు రోజుల్లో జిల్లా వ్యాప్తంగా ఎన్ని కాంప్లెక్స్‌లు ఉంటాయో స్పష్టత వస్తుంది.
– జి.పగడాలమ్మ, డీఈఓ, పార్వతీపురం మన్యం జిల్లా

క్లుప్తంగా

యువకుడి ఆత్మహత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ గోవిందరావు, తదితరులు

కొమరాడ: మండలంలోని పాత గుణానపురం రబ్బబండ వద్ద సీతానగరం మండలం నిడగల్లు గ్రామానికి చెందిన కుప్పిలి పాపారావు (34) ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారం మేరకు పార్వతీపురం రూరల్ సీఐ గోవిందరావు, కొమరాడ ఎస్సై నీలకంఠం శనివారం గ్రామానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఉరి పోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని సీఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పార్వతీపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐదు ఇసుక ట్రాక్టర్లు సీజ్



సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్లు

రేగిడి: మండలంలోని బొడ్డవలస నాగావళి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఐదు ఇసుక ట్రాక్టర్లను రేగిడి ఎస్సై పి.నీలావతి, సిబ్బంది శనివారం సీజ్ చేశారు. పట్టుబడిన వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్సై నీలావతి మాట్లాడుతూర, బొడ్డవలస గ్రామం వద్ద గల పైలెట్ ప్రాజెక్ట్ నీటిపథకం సమీపంలో ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు చేపట్టడంతో వాహనాలను సీజ్ చేశామని చెప్పారు.

15 కిలోల గంజాయి స్వాధీనం

- ముగ్గురి అరెస్ట్



పోలీసుల అదుపులో నిందితులు

మెరకముడిదాం: మండలంలోని శ్యామాయవలసలో శనివారం తెల్లవారుజామున ముగ్గురు యువకులు గంజాయిని తరలిస్తూ పట్టుబడ్డారు. పోలీసులు తెలియజేసిన వివరాల మేరకు... తెర్లాం మండలం పెరుమాళి గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు, రంగప్పవలసకు చెందిన మరో యువకుడు తెల్లవారు జాము 3 గంటలకు శ్యామాయవలస నుంచి ఉత్తరవల్లి వైపు వెళ్తున్నారు. అయితే వీరి ప్రవర్తన అనుమానంగా ఉండడంతో గ్రామానికి చెందిన కొందరు యువకులు ప్రశ్నించగా... వారి వద్ద నుంచి 15 కిలోల గంజాయి లభించింది. దీంతో స్థానికులు బుధరాయవలస పోలీసులకు సమాచారం చేరవేయగా.. వెంటనే గరివిడి ఏఎస్సై రమణ ఆధ్వర్యంలో పోలీసులు గ్రామానికి చేరుకుని యువకులను అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి 15 కిలోల గంజాయితో పాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌చార్జ్ ఎస్సై బి.లోకేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు



మాట్లాడుతున్న ఏసీ చిరంజీవి

రాజాం సిటీ: గ్రామీణ ప్రాంతాల్లోని చదువుకున్న నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించనున్నామని వెలుగు ఏసీ ఎ.చిరంజీవి తెలిపారు. ఇదే విషయమై ఆయన మండల కేంద్రంలోని తన కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించి, వివరాలు వెల్లడించారు. బీఎస్సీ కెమిస్ట్రీ చదువుకుని 19 నుంచి 27 ఏళ్ల వయసు కలిగిన యువత విజయనగరం టీటీడీసీలో జరగనున్న ప్రొడక్షన్ కెమిస్ట్ శిక్షణకు హాజరుకావాలన్నారు. నాలుగు నెలల పాటు శిక్షణ ఉంటుందన్నారు. విజయనగరం సెంచూరియన్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో స్టోర్‌కీపర్, సెక్యూరిటీ ఉద్యోగాలకు శిక్షణ ఇస్తుందన్నారు. స్టోర్‌కీపర్‌లకు ఇంటర్మీడియట్ లేదా ఐటీఐ చదువుకుని 19 నుంచి 30 ఏళ్లలోపు వారు అర్హులన్నారు. అలాగే డిగ్రీ విద్యార్థులకు సెక్యూరిటీ ఆఫీసర్ శిక్షణ ఇవ్వనున్నారన్నారు. ఆసక్తి ఉన్న నిరుద్యోగ యువకులు 10వ తరగతి సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, జాబ్ కార్డు, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, బ్యాంకు అకౌంట్, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో ఆయా కేంద్రాలకు హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు స్థానిక ఐకేపీ కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹117	₹204	₹214

పసుపు సాగుపై పెరుగుతున్న ఆసక్తి



మండ ప్రాంతంలో వేసిన పసుపు

- ప్రత్యామ్నాయ పంటగా కొండపోడులో సాగు
- ఎకరాకు 25–30 కావిళ్ల వరకు దిగుబడి
- పచ్చి పసుపు కావిడ ధర రూ.600 నుంచి రూ.700
- ఎక్కువగా ఆసక్తి చూపుతున్న గిరిజన రైతులు

మండలం	పసుపు సాగు (హెక్టార్లలో)
సాలూరు	220
సీతంపేట	1120
మక్కువ	69
పాచిపెంట	65

సీతంపేట:

జిల్లాలోని సీతంపేట ఏజెన్సీలో పసుపు సాగు విస్తీర్ణం ఏటా పెరుగుతోంది. గిరిజన రైతులు ఎక్కువగా ఈ పంటపై ఆసక్తి చూపుతున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో దాదాపు 1474 హెక్టార్లలో పసుపు పంటను సాగుచేస్తున్నారు. ఇక్కడి పసుపు పంటకు నాణ్యమైనదిగా గుర్తింపు ఉండడంతో మైదాన వ్యాపారులు సైతం వచ్చి ఏజెన్సీ సంతల్లో పసుపు కొమ్ములు పచ్చివి, ఎండువి కొనుగోలు చేస్తుంటారు. కొండపోడులో భాగంగా పసుపు పంట వేస్తారు. జీడిపంటలో అంతరపంటగా సాగుచేస్తారు. కుశిమి, శంభాం, జొనగ, దోనుబాయి, మర్రిపాడు, పొల్ల, కడగండి తదితర పంచాయతీల పరిధిలో ఈ పంట సాగవుతుంది. ఉద్యానవనశాఖ కూడా గతంలో ఈ పంటను ప్రోత్సహించేది. పసుపు విత్తనాలు కూడా ఇచ్చేవారు. అయితే కొన్నేళ్లుగా రైతులకు పసుపు విత్తనాలు పంపిణీ చేసిన దాఖలాలు లేవు. రైతులే విత్తనాలు తయారు చేసుకుని సాగుచేస్తున్నారు. అంతగా పెట్టుబడులు లేకపోవడంతో గిరిజన రైతులు ఈ పంటను ఎక్కువగా పండిస్తున్నారు. మైదాన ప్రాంతాలతో పోలిస్తే ఏజెన్సీలోనే అధిక విస్తీర్ణంలో పసుపు సాగవుతోంది.

ప్రాసెసింగ్ యూనిట్‌లో పసుపు తయారీ..

సీతంపేట ఏజెన్సీలోని దిబ్బగూడలో వీడీవీకే ఆధ్వర్యంలో పసుపు ప్రాసెసింగ్ యూనిట్‌ను గతంలో నెలకొల్పారు. దీని ద్వారా పసుపు గుండ ప్యాకెట్‌లు తయారుచేసి నాణ్యమైన పసుపును విక్రయిస్తున్నారు. ఇక్కడి పసుపు ఉత్పత్తికి చాలా డిమాండ్ ఉంది. రూ.7 కోట్లతో పసుపు ప్రాసెసింగ్ యూనిట్ పెట్టడానికి అధికార యంత్రాంగం త్వరలో చర్యలు తీసుకుంటుందని సంబంధిత వెలుగు అధికార వర్గాలు తెలిపాయి.

అంతర పంటగా..

అంతర పంటగా గిరిజనులు పసుపు పండిస్తున్నారు. ఎకరా పొలంలో 10 కావిళ్ల వరకు పసుపు విత్తనాలు నాటుతారు. బాగా పండితే 25 నుంచి 30 కావిళ్ల వరకు దిగుబడి వస్తుందని గిరిజనులు చెబుతున్నారు. ఈ మొక్కలు ఏపుగా పెరగడానికి ప్రతిసారీ కలుపు మొక్కలను ఏరివేయాలని వర్షపాతం తగినంత ఉన్నట్లయితే ఏడాదిలో రెండు సార్లు పసుపుదుంపలను తవ్వుకోవచ్చంటున్నారు. విజయదశమి పండగ వచ్చేసరికి కొంత దిగుబడి వస్తుందని గిరిజనులు తెలిపారు. ఒక్కో కావిడ రూ.600ల నుంచి రూ.700వరకు నాణ్యతను బట్టి విక్రయిస్తామన్నారు. మైదాన ప్రాంతాల్లో మంచి డిమాండ్ ఉందని, ఎండు పసుపు కావిడ రూ.1500 నుంచి రూ.2 వేల వరకు విక్రయిస్తామని తెలిపారు. ఎండు పసుపు కొమ్ములు తయారు కావాలంటే చాలా పని ఉంటుంది. పచ్చి పసుపును ఉడకబెట్టి బాగా ఎండబెట్టి కాళ్లతో తొక్కినట్లయితే పైపొర పోతుందని దీన్ని వారపు సంతల్లో విక్రయి స్తామని గిరిజనులు తెలిపారు.

విత్తనాలు పంపిణీ చేస్తే బాగు



పసుపు విత్తనాలు పంపిణీ చేస్తే బాగుంటుంది. ఐటీడీఏ గతంలో పసుపు విత్తనాలు సరఫరా చేసేది. ఇప్పుడు పంపిణీ చేయడంలేదు. దీంతో ఈ విత్తనాలకోసం ఎదురు చూడాల్సి వస్తోంది. స్థానికంగా విత్తనాలు కట్టుకుని సాగుచేసుకుంటున్నాం.

– ఎస్.లక్కాయి, సీదిగూడ

గిట్టుబాటు ధర కల్పించాలి



పసుపు పంటకు గిట్టుబాటు ధరలు కల్పించాలి. జీసీసీనే పసుపు కొనుగోలు చేయడం లేదు. దీంతో దళారుల బారిన పడాల్సి వస్తోం ది. గిట్టుబాటు ధరలు కల్పించాలని గతంలో అనేక వినతులు కూడా సమర్పించాం.

– ఎస్.షోడంగ, చింతాడ

సంప్రదాయబద్ధంగా సిరిమాను సంబరం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విజయనగరం ఫోర్ట్: పైడిమాంబ సిరిమాను సంబరం సంప్రదాయబద్ధంగా నిర్వహించాలని ఎంఎస్ఎంఈ సెర్ప్, ఎన్నారై వ్యవహార శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. అక్టోబర్ 13, 14 తేదిల్లో విజయనగరం ఉత్సవాలు.. 14, 15 తేదిల్లో పైడితల్లి అమ్మవారి పండగ నిర్వహణపై శనివారం స్థానిక కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పండగకు హాజరైన ప్రతి ఒక్కరికీ మధుర స్మృతులను మిగిల్చే విధంగా విజయనగరం ఉత్సవాలు, సిరిమాను సంబరం నిర్వహించాలని సూచించారు. ఈ ఉత్సవాలకు సుమారు ఐదారు లక్షల మందికి పైగా భక్తులు హాజరయ్యే అవకాశం ఉందని, వారికి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఇందుకోసం ప్రభుత్వ శాఖలన్నీ చక్కని సమన్వయంతో పనిచేయాలన్నారు. ఉత్సవాలు, పండగ నిర్వహణకు రూ. 2 కోట్ల అంచనా వ్యయంతో ప్రణాళికలను రుపొందిస్తున్నట్లు చెప్పారు. జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. అమ్మవారి ఉత్సవాలకు ఉత్తరాంధ్ర నుంచే కాకుండా ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి కూడా లక్షలాది మంది భక్తులు హాజరవుతారని తెలిపారు. సిరిమానోత్సవం త్వరగా ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. మేయర్ వెంపడాపు విజయలక్ష్మి మాట్లాడుతూ.. సామన్య భక్తులు దర్శనానికి ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అధితి గజపతి రాజు, కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్, ఎస్పీ వకుల్ జిందల్, డీఆర్‌ఓ అనిత, డీఆర్‌డీఏ పీడీ కల్యాణచక్రవర్తి, ఆలయ ఈఓ ప్రసాదరావు, పూజారి బంటుపల్లి వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థులకు క్విజ్ పోటీలు

- దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 17 వరకు గడువు



విద్యార్థులు

విజయనగరం: మనదేశంలో ఆర్థిక వ్యవహారాలను పర్యవేక్షించే భారతీయ రిజర్వ్ బ్యాంక్ 90వ ఏడాదిలోకి ప్రవేశించిన సందర్భంగా ఆర్బీఐ–90 పేరుతో దేశవ్యాప్తంగా డిగ్రీ విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించనుంది. వివిధ స్థాయిల్లో జగరనున్న పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి నగదు రూపంలో బహుమతులు అందజేయనుంది.

పోటీ, నమోదు ఇలా..

క్విజ్ పోటీల్లో అంతర్జాతీయ, జాతీయ వ్యవహారాలు, ఆర్బీఐ డిజిటల్ కరెన్సీ, ఆర్థిక వ్యవస్థ, సాహిత్య, చరిత్ర, ఆటలు, శాస్త్ర సాంకేతిక విషయాలతో పాటు సమకాలీన అంశాలపై ప్రశ్నలు ఉంటాయి. పోటీల్లో తలపడేందుకు 2024 సెప్టెంబర్ 1 నాటికి 25 ఏళ్లలోపు ఉండి, ఏదైనా డిగ్రీ కళాశాలలో చదువుతున్నవారు అర్హులు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఆర్‌బీఐ90క్విజ్.ఇన్ వెబ్‌సైట్‌లో పేరు, ఐడీ, ఈమెయిల్, ఫోన్ నంబర్, తదితర వివరాలను ఈనెల 17వ తేదీ లోగా నమోదు చేసుకోవాలి. ఒక కళాశాల నుంచి ఎంతమందైనా పాల్గొనవచ్చు. ఒక జట్టులో ఇద్దరు తప్పనిసరిగా ఉండాలి. జిల్లా, రాష్ట్ర, జోనల్, జాతీయ స్థాయిల్లో ఆంగ్లం, హిందీ మాధ్యమాల్లో పోటీలు నిర్వహిస్తారు. ప్రతి స్థాయిలో విజేతలైన వారే తర్వాత దశకు అర్హత పొందుతారు.

విజేతలకు నగదు బహుమతులు

జిల్లా స్థాయిలో విజయం పొందిన వారు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హులు. అక్కడ గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా రూ.2 లక్షలు, రెండో బహుమతిగా రూ.1.5 లక్షలు, మూడో బహుమతిగా రూ. లక్ష లభిస్తాయి. జోనల్ స్థాయిలో రూ.5 లక్షలు, రూ. 4 లక్షలు, రూ.3 లక్షలు వరుసుగా అందిస్తారు. అనంతరం జరిగే జాతీయ స్థాయి విజేతలకు రూ.10 లక్షలు, రూ.8 లక్షలు, రూ.6 లక్షలు ప్రైజ్‌మనీగా అందజేస్తారు. పోటీలు సెప్టెంబర్ 19 నుంచి 21వ తేదీ వరకు ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు ఆన్‌లైన్ వేదికగా జరుగుతాయి. ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో చదవుతున్న వేల మంది విద్యార్థులకు ఇది సదవకాశం.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆకలి కేకలు

- మధ్యాహ్నం 12 గంటల వరకు వంట చేయని సిబ్బంది
- కొన్ని కేంద్రాల్లో కానిరాని చిన్నారులు
- మరి కొన్ని కేంద్రాల్లో విధులకు డుమ్మా కొట్టిన అంగన్‌వాడీలు



బీసీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో 11 మందికి గాను వచ్చిన ముగ్గురు చిన్నారులు



పిల్లలు లేక పోవడంతో ఖాళీగా ఉన్న బీసీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రం -2

విజయనగరం ఫోర్ట్: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు సకాలంలో వంట చేయక పోవడం వల్ల పిల్లలు ఆకలితో ఇబ్బంది పడుతున్నారు. శనివారం మధ్యాహ్నం 12 గంటలైనా అంగన్‌వాడీ సిబ్బంది వంట చేయలేదు. పిల్లలకు ఎందుకు వంట చేయలేదని అంగన్‌వాడీ సిబ్బందిని అడిగితే సమాధానం చెప్పకుండా బిక్కమొఖం వేశారు. కొన్ని కేంద్రాల్లో రికార్డుల ప్రకారం పిల్లలు 10 నుంచి 15 మంది ఉంటే.. శనివారం ఒక్క పిల్లవాడు కూడా కేంద్రాలకు రాలేదు. మరికొన్ని కేంద్రాల్లో సిబ్బంది విధులకు డుమ్మా కొట్టారు. ఉదయం 11:30 గంటల ప్రాంతంలో బొబ్బాదిపేట అంగన్‌వాడీ కేంద్రంలో ఆయా, ఐదుగురు పిల్లలు ఉన్నారు. కార్యకర్త కేంద్రానికి వచ్చి వెళ్లిపోయారు. పిల్లలకు అప్పటివరకు వంట చేయలేదు. 11:45 ప్రాంతంలో బీసీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రం –1లో ముగ్గురు చిన్నారులు మాత్రమే ఉన్నారు. వాస్తవానికి ఇక్కడ ఉండాల్సిన చిన్నారుల సంఖ్య 11. ఈ కేంద్రంలో చిన్నారులకు వంట చేయలేదు. ఇదే ప్రాంగణంలో ఉన్న అంగన్‌వాడీ సెంటర్ –3 లో 10 మంది పిల్లలకు గాను ఒక్కరు కూడా రాలేదు. మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో అంగన్‌వాడీ సెంటర్ –4లో 13 మంది పిల్లలకు గాను ఒక్క పిల్లవాడు లేడు. అలాగే అంగన్‌వాడీ సెంటర్ – 2 లో 12 మంది పిల్లలకు గాను ఒక్కరు కూడా రాలేదు. ఇదే విషయాన్ని అర్బన్ ఐసీడీఎస్ పీఓ జి. ప్రసన్న వద్ద సాక్షి ప్రస్తావించగా .. 12 గంటల వరకు ఎందుకు వంట చేయలేదో విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే చిన్నారుల గైర్హాజరుపై కూడా విచారణ చేస్తామని తెలిపారు.

ఓపీ సేవలు బంద్



గంట్యాడ పీహెచ్‌సీ వద్ద నిరసన తెలియజేస్తున్న వైద్యుడు

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో ఉన్న అన్ని పీహెచ్‌సీల్లో వైద్యులు అవుట్ పేషెంట్ సేవలు నిలిపివేశారు. పీజీ వైద్య విద్యలో ఇన్ సర్వీస్ కోటాను తగ్గిస్తూ ప్రభుత్వం జీఓ 85ను జారీ చేయడాన్ని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పీహెచ్‌సీల్లో వైద్యులు దశల వారీగా నిరసన తెలియజేస్తున్నారు. ఇందులో భాగంగా 11, 12 తేదీల్లో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. అయినప్పటికీ ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన రాకపోవడంతో ఉద్యమాన్ని ఉధృతం చేశారు. జిల్లాలో 54 పీహెచ్‌సీల్లోనూ శనివారం అత్యవసర వైద్యసేవలు మినహాయించి, ఓపీ సేవలను నిలిపివేశారు. ఇన్‌సర్వీస్ కోటా పెంచేవరకూ పోరాటం చేస్తామని వైద్యులు తెలిపారు.

డ్యాన్స్ చేస్తూ కుప్పకూలిన యువకుడు

- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వైనం
- డీజేలతో తలెత్తుతున్న సమస్యలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వినయ్

రాజాం సిటీ: అంతవరకు అందరితో కలిసి డీజే ముందు డ్యాన్స్ చేసిన యువకుడు ఒక్కసారిగా అస్వస్థతకు గురై కుప్పకూలిపోయాడు. ఈ సంఘటన శుక్రవారం రాత్రి మున్సిపాలిటీ పరిధి పొనుగుటివలస గ్రామంలో నిర్వహించిన వినాయక నిమజ్జనంలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి గ్రామస్తులు తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన వావిలపల్లి వినయ్ అనే ఇరవై ఏళ్ల యువకుడు వినాయకుని నిమజ్జనం సందర్భంగా ఏర్పాటు చేసిన డీజే వద్ద డ్యాన్స్‌చేసి ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. విషయం గమనించిన కొంతమంది యువకులు అతనిని పరిశీలించగా అపస్మారకస్థితిలో ఉన్నట్లు గుర్తించి సపర్యలు చేపట్టి ఇంటికి చేర్చారు. అక్కడ నుంచి రాజాంలోని ఓ ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు. గుండె సంబంధిత సమస్యగా గుర్తించిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం రిఫర్ చేశారు. అక్కడ నుంచి విశాఖపట్నం తరలించారు. డీజేల వల్ల పలు సమస్యలు తలెత్తుతున్నా యువత పట్టించుకోకపోవడం విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై రాజాం టౌన్, రూరల్ సీఐలు కె.అశోక్‌కుమార్, హెచ్.ఉపేంద్ర వద్ద ప్రస్తావించగా.. డీజేలకు ఎటువంటి అనుమతుల్లేవన్నారు. వినాయక నిమజ్జనాల్లో డీజేలు పెడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మట్టిలో మాణిక్యాలను వెలికితీసేందుకే..



సాధన చేస్తున్న క్రీడాకారులు (ఫైల్)

- స్కూల్ గేమ్స్ పోటీలు
- ఉత్సాహభరిత వాతావరణంలో మండల, నియోజకవర్గ స్థాయి పోటీలు
- ఈ నెల 18న జూడో, ఫుట్‌బాల్ క్రీడాంశాల్లో జిల్లా స్థాయి ఎంపికలు

విజయనగరం: ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికితీసేందుకు ప్రభుత్వం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహిస్తోంది. ఇప్పటికే జిల్లా స్థాయిలో ఎంపిక పోటీలు నిర్వహించేందుకు షెడ్యూల్ ఖరారు చేశారు. ఇక్కడ విజయం సాధిస్తే జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల వరకు వెళ్లే అవకాశం ఉంటుంది. పోటీల్లో పాల్గొనేవారికి అధికారులు సర్టిఫికెట్లు అందజేస్తారు. దీంతో స్పోర్ట్స్ కోటాలో ఇంజినీరింగ్, మెడిసిన్, ఇతర కోర్సుల్లో సీట్లు పొందే అవకాశం ఉంది.

మండల, నియోజకవర్గ స్థాయిలో..

మండల, నియోజకవర్గసాయిలో అథ్లెటిక్స్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, యోగా, చదరంగం విభాగాల్లో పోటీలు జరుగుతున్నాయి. జిల్లా స్థాయిలో ఫుట్‌బాట్, హాకీ, హ్యాండ్‌బాల్, బాస్కెటబాల్, టెన్నిస్, టేబుల్ టెన్నిస్, స్విమ్మింగ్, జిమ్నాస్టిక్స్, వెయిట్ లిఫ్టింగ్, బాడీబిల్డింగ్, రెజ్లింగ్, బాక్సింగ్, రోయింగ్, షూటింగ్, సైక్లింగ్, ఫెన్సింగ్, రోలర్ స్కేటింగ్, విలువిద్య, క్రికెట్, జూడో, స్క్వాష్ పోటీలు నిర్వహించనున్నారు. మండల, నియోజకవర్గ స్థాయి పోటీల్లో విజేతలు జిల్లా స్థాయికి.. ఇక్కడ విజయం సాధించిన వారు రాష్ట్ర, జాతీయస్థాయిలో పాల్గొనే అవకాశం ఉంది. వ్యక్తిగత క్రీడలకు సంబంధించి మొదటి, రెండు స్థానాల్లో నిలిచిన క్రీడాకారులు మాత్రమే రాష్ట్రస్థాయిలో పాల్గొంటారు.

ఎవరు పాల్గొనవచ్చు

పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో జరిగే ఈ పోటీలకు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ప్రతి ఒక్కరూ పాల్గొనవచ్చు. ఉమ్మడి జిల్లాలో అన్ని యాజమాన్యాలకు చెందిన పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొనేందుకు అర్హులే. అండర్–14 విభాగంలో పాల్గొనే బాల, బాలికలు 01.01.2011 తర్వాత జన్మించి ఉండాలి. అండర్–17 బాల, బాలికలు 01.01.2008 తర్వాత జన్మించిన వారై ఉండాలి.

18న జూడో, ఫుట్‌బాల్ క్రీడాంశాల్లో ఎంపికలు..

రాష్ట్ర స్థాయిలో జరగనున్న స్కూల్ గేమ్స్ క్రీడా పోటీల్లో పాల్గొనే క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈనెల 18న నిర్వహించనున్నట్లు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి కృష్ణంరాజు తెలిపారు. ఆ రోజు ఉదయం జిల్లా కేంద్రంలో గల రాజీవ్ క్రీడామైదానం ప్రాంగణంలో అండర్–14, అండర్–17 వయస్సుల విభాగాల్లో బాల, బాలికలకు ఫుట్‌బాల్ క్రీడాంశంలో ఎంపిక పోటీలు నిర్వహిస్తామన్నారు. అదేవిధంగా అదే రోజు రామభద్రాపురం మండల కొట్టక్కి జిల్లా పరిషత్ స్కూల్‌లో అండర్–14,17 వయస్సుల విభాగాల్లో బాల, బాలికలకు జూడో క్రీడాంశంలో ఎంపికలు నిర్వహిస్తామని తెలిపారు. అర్హత, ఆసక్తిగల క్రీడాకారులు తమ వయస్సు ధ్రువీకరణపత్రంతో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయుల నుంచి స్టడీ సర్టిఫికేట్ వెంట తీసుకు రావాలని సూచించారు.



పరుగు పందెంలో సాధన చేస్తున్న విద్యార్థినులు